



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
ఆదివారం
22-02-2026
పేజీలు: 02




## పెళ్లిళ్లకు కొన్ని గంటల ముందు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

వాళ్లిద్దరూ అక్కాచెల్లెళ్లు. కొన్ని గంటల్లో ఆ ఇద్దరూ పెళ్లి పీటలు ఎక్కాల్సి ఉంది. ఒకే పందిరి కింద అక్కాచెల్లెళ్ల పెళ్లిళ్లు చూసేందుకు అప్పటికే బంధుమిత్రులంతా చేరుకున్నారు. పెళ్లి మండపం పరిసరాలు సందడి సందడిగా మారాయి. కానీ ఇంతలో ఘోరం జరిగింది. ఏమైందో ఏమోగానీ పెళ్లి కుమార్తెలిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లాలోని మనాయ్ గ్రామంలో గుండెను పిండేసే ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యలకు పాల్పడ్డ పెళ్లి కుమార్తెలు శోభ (25), విమ్ల (23) ఇద్దరూ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్లుగా పనిచేస్తున్నారు. శనివారం వారి పెళ్లిళ్లు జరగాల్సి ఉండటంతో శుక్రవారం అర్ధరాత్రి వరకు ఇంట్లో పెళ్లి వేడుకలు, సంప్రదాయ 'బంధోలి' కార్యక్రమం సందడిగా సాగాయి. అయితే శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరూ పురుగుల మందు సేవించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే పరిశీలించిన వైద్యులు అప్పటికే వారు మరణించినట్లు ప్రకటించారు. దాంతో మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. కానీ ఇంతలో మృతుల మేనమామ జస్వంత్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి అంత్యక్రియలను నిలిపేశారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యం జరిగి ఉంటే అంత్యక్రియలు పూర్తయ్యేవని జస్వంత్ సింగ్ చెప్పారు. మృతదేహాలు నీలి రంగులోకి మారాయని, ఇది విష ప్రయోగంవల్ల జరిగిన ఆత్మహత్యేనని మృతుల మేనమామ ఆరోపించారు. బాధితుల బాబాయ్‌లు, ఈ పెళ్లిళ్ల విషయంలో తీవ్ర ఒత్తిడి తెచ్చారని, మొదట కుదిరిన పెళ్లి సంబంధాలను రద్దుచేసి, బాబాయ్‌ల ఒత్తిడి మేరకు పోఖ్రాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పెళ్లిళ్లు నిశ్చయించారని చెప్పారు. ఈ బలవంతపు పెళ్లి ఇష్టంలేకనే తన మేనకోడళ్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాగా, పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోస్టుమార్టంలో వారి మరణానికి పురుగుల మందే కారణమని తేలింది. వారు పురుగుల మందు తాగినట్లుగా ఆధారాలు లభించాయి.




బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అరెస్టు...

## కిషన్ రెడ్డి ఆగ్రహం

తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు అరెస్టు చేశారు. కామారెడ్డి, బాన్సువాడలకు వెళ్లేందుకు ఆయన ప్రయత్నించడంతో తార్నాకలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. రామచందర్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. రామచందర్ రావును అరెస్టు చేసిన సమయంలో పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రెండు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగిన నేపథ్యంలో అక్కడకు వెళ్లేందుకు రామచందర్ రావు సిద్ధమయ్యారు. అదే సమయంలో కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ వారు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ అక్కడకు కూడా వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

## పోలీసుల అదుపులో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్ నుండి కామారెడ్డి జిల్లా బాన్సువాడకు తరలివెళ్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను 161 జాతీయ రహదారిపై పోలీసులు అడ్డుకున్నారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కింగ్స్ 9 రెస్టారెంట్ వద్ద మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తోపాటు పోలీసులు ముందస్తుగా ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అదుపులోకి తీసుకొని పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాన్సువాడలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి రాజాసింగ్ తరలివెళ్తుండగా మార్గమధ్యంలో పెద్ద శంకరంపేటలో పోలీసులు అరెస్టు చేసి ఇలా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# 56 డేస్ సిరీస్ రివ్యూ




'56 డేస్ ' .. హాలీవుడ్ థ్రిల్లర్ సిరీస్. సైకలాజికల్ థ్రిల్లర్ ను టచ్ చేస్తూ సాగే మిస్టరీ థ్రిల్లర్ ఇది. కేథరిన్ ర్యాన్ హోవార్డ్ రాసిన నవల ఆధారంగా ఈ సిరీస్ ను రూపొందించారు. 2021లో అత్యధికంగా అమ్ముడైన నవలలో ఇది ఒకటి. డవ్ కామెరాన్ - అవాన్ జోగియా ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్, ఇంగ్లిష్ తో పాటు ఇతర భాషల్లోను 8 ఎపిసోడ్స్ తో అందుబాటులోకి వచ్చింది. ఈ 8 ఎపిసోడ్స్ కి నలుగురు దర్శకత్వం వహించారు. 'బోస్టన్'లోని ఓ ఇంట్లో ఒక దారుణమైన హత్య జరుగుతుంది. బాత్ టబ్ లో శవం కుళ్లిన స్థితిలో లభిస్తుంది. ఆ శవం పురుషుడిదా ? స్త్రీకి సంబంధించిందా ? అనే విషయం తేల్చడం సవాలుగా మారుతుంది. మిస్టరీగా మారిన ఈ మర్డర్ కేసును పరిష్కరించడానికి, ఆఫీసర్ 'లియార్డిన్' (కార్లా) ఆమె భర్త కార్ల్ ( డోరియన్) రంగంలోకి దిగుతారు. వాళ్లు ఆ ఇంటిని అణువణువున పరిశీలన చేస్తారు. హత్య జరిగిన ఆ ఇంట్లో అలీవర్ (అవన్ జోగియా) సియారా (కామెరాన్) ఉండేవారని తెలుసుకుంటారు. వాళ్లిద్దరూ ప్రేమికులై ఉంటారనే ఒక నిర్ధారణకు వస్తారు. హత్య జరగడానికి ముందు, '56 రోజులు' వెనక్కి వెళితే, సియారా - అలీవర్ ల ప్రేమకథ కళ్లముందుకు వస్తుంది. అలీవర్ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు. గతం తాలూకు గాయం అతణ్ణి వెంటాడుతూ ఉంటుంది. అందువలన డాక్టర్ 'డాన్' దగ్గర అతను కౌన్సిలింగ్ తీసుకుంటూ ఉంటాడు. అలాంటి పరిస్థితులలోనే అతనికి సియారా (కామెరాన్) పరిచయమవుతుంది. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారుతుంది. ఇద్దరూ సహజీవనం చేయడం మొదలు పెడతారు.

అలీవర్ తన జీవితంలోని కొన్ని రహస్యాలను సియారాతో పంచుకోలేని పరిస్థితి. ఇక వేరే ఊళ్లో సియారా ఫ్యామిలీ చాలా ఆర్థికపరమైన ఇబ్బందుల్లో ఉంటుంది. అందువలన అలీవర్ ఎకౌంటులో నుంచి కొంత ఎమౌంట్ తీసి తన వాళ్లకి పంపించాలని నిర్ణయించుకుంటుంది. గతంలో తన కుటుంబానికి అలీవర్ చేసిన ద్రోహానికి అలా చేయడమే కరెక్ట్ అని ఆమె భావిస్తుంది. ఒకానొక దశలో ఒకరి మనసులో ఏముందో ఒకరికి తెలిసిపోతుంది. ఆ తరువాతనే హత్య జరుగుతుంది. ఎవరు ఎవరిని హత్య చేశారు ? ఒకరితో ఒకరికి ముడిపడిన ఆ గతం ఏమిటి ? అనేది కథ. '56 డేస్'లో ఒక ప్రేమజంట జీవితంలో ఎలాంటి మలుపులు చోటుచేసుకున్నాయి అనే ఈ కథ, ముందుగా నవలగా వ్రాయబడింది. ఆ తరువాతనే సిరీస్ గా ఇది తెరకెక్కింది. అందువల్లనే ఈ సిరీస్ ను చూస్తుంటే, ఒక పుస్తకాన్ని చదువుతున్నట్టుగానే అనిపిస్తూ ఉంటుంది. కథ .. కథలోని పాత్రలను డిజైన్ చేసిన తీరు చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. స్క్రీన్ ప్లే ఈ కథకి ప్రధానమైన బలం .. ప్రాణం అని చెప్పాలి. కథ అంతా కూడా అంతకుముందు .. ప్రస్తుతం అన్నట్టుగా సాగుతుంది. అంటే ఒక వైపున ప్రేమకథను .. మరో వైపున హత్యకి సంబంధించిన ఇన్వెస్టిగేషన్ కొనసాగుతూ ఉంటాయి. గతానికి సంబంధించిన కథ పూర్తయ్యే సమయానికి ప్రస్తుతానికి సంబంధించిన కథ ముగింపుకు వస్తుంది. అయితే ఈ ముగింపులో ట్విస్ట్ ఉంటుంది. చివరివరకూ ఈ ట్విస్ట్ ను అలా హోల్డ్ లో పెట్టేసి కథనాన్ని నడిపించిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది. కథలో పాత్రల సంఖ్య ఎక్కువే. ప్రతి పాత్రకి ఒక ప్రయోజనం ఉంటుంది. హీరో వైపు నుంచి .. హీరోయిన్ వైపు నుంచి .. హత్య కేసును ఇన్వెస్టిగేషన్ చేసే పోలీస్ ఆఫీసర్స్ వైపు నుంచి .. ఇలా అన్ని కోణాల్లో ఈ కథను అల్లుకుంటూ వచ్చిన తీరు ఆకట్టుకుంటుంది. ఒక్కో ఎపిసోడ్ నిడివి ఎక్కువగానే ఉంటుంది. అలాగని చెప్పి బోర్ అనిపించదు. ఎందుకంటే నెక్స్ట్ కథకు అవసరమైన ఫీడ్ ను ఈ ఎపిసోడ్ అందిస్తూ ఉంటుంది.

కాస్‌గంజ్‌లో ఘోరం.. కుటుంబంలోని

## ఐదుగురూ అనుమానాస్పద మృతి



ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాస్‌గంజ్ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ ఘటన స్థానికంగా పెను కలకలం రేపింది. భర్తే తన భార్యను, ముగ్గురు పిల్లలను కిరాతకంగా హతమార్చి, ఆ తర్వాత తాను కూడా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. అమన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెట్రోల్ పంపు దగ్గర సత్యదేవ్ ఫౌజీ అనే వ్యక్తి వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి అక్కడే నివసిస్తున్నాడు. అయితే గత రెండు రోజులుగా అతని ఇంటి తలుపులు మూసే ఉన్నాయి. ఇవాళ ఉదయం ఆ ఇంటి నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా.. ఒకే గదిలో ఐదు మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి. మృతదేహాల పరిస్థితిని బట్టి చూస్తే ఈ ఘోరం జరిగి కనీసం రెండు రోజులు అయ్యి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతులను సత్యదేవ్, అతని భార్య, ముగ్గురు పిల్లలుగా గుర్తించారు. ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలం నుంచి కీలక ఆధారాలు సేకరించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అసలు ఈ దారుణానికి దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆర్థిక సమస్యలా.. లేక కుటుంబ కలహాలేమైనా ఉన్నాయా.. అనే కోణంలో విచారిస్తున్నారు. ఈ ఘటనపై లోతైన విచారణ కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సత్యదేవ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు.

## ఫిబ్రవరి 23న ఆశా వర్కర్ల "ఛలో హైదరాబాద్"

ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం రాజధాని బాట పడుతున్నారు. నిజామాబాద్ సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆశా వర్కర్ల విషయమై సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలనే డిమాండ్‌తో.. ఫిబ్రవరి 23న హైదరాబాద్‌లో నిర్వహించే "ఛలో హైదరాబాద్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలు ప్రజారోగ్య రంగంలో ముఖ్య భూమిక పోషిస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలు, శిశువులు, బాలింతల సంరక్షణలో కీలకంగా సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. అయినప్పటికీ, వారికి తగిన పారితోషికం, భద్రత, గౌరవం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రధాన డిమాండ్లు వెల్లడిస్తూ.. పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు బిల్లులు తక్షణమే చెల్లించాలి. ఆశా కార్యకర్తలకు కనీసం రూ. 18,000 ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలి. ఎన్సీడీ సర్వే పేరుతో పెరుగుతున్న అదనపు పనిభారం తగ్గించాలి. ANC, PNC టార్గెట్ల పేరుతో ఒత్తిళ్లు నిలిపివేయాలని, ఆశాల పనిభారానికి అనుగుణంగా సదుపాయాలు, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



## కృతి శెట్టి కోలీవుడ్ ఎంట్రీ ఆలస్యం!

ఉప్పెనతో టాలీవుడ్ లో అడుగుపెట్టి, మొదటి మూడు చిత్రాలతో హిట్ అందుకున్న కన్నడ నటి కృతి శెట్టి, ఆ తర్వాత వరుస ఫ్లాపులతో ఇబ్బంది పడుతోంది. తెలుగులో సక్సెస్ దక్కకపోవడంతో మాలీవుడ్ లో ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ఏడాది కోలీవుడ్ లోకి అడుగుపెట్టాలని భావించినా, ఆమె నటించిన సినిమాలు విడుదల ఆలస్యం అవుతున్నాయి. కార్తీతో నటించిన 'వా వాతియార్' సినిమా షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. అలాగే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా కూడా డిసెంబర్ 18కి వాయిదా పడింది.

## అభిషేక్ వైఫల్యానికి అతడి స్టైలే కారణం: ఇర్ఫాన్ పఠాన్




టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ వరుస వైఫల్యాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఖాతా తెరవకుండానే వెనుదిరిగిన అభిషేక్ ప్రదర్శనపై మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ స్పందించారు. అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికాతో జరగనున్న కీలక సూపర్-8 పోరుకు ముందు పఠాన్ కొన్ని కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ఆఫ్‌స్పిన్నర్లను ఎదుర్కోవడంలో అభిషేక్ టెక్నిక్, షాట్ ఎంపికలో పొరపాట్లు చేస్తున్నారని ఆయన విశ్లేషించారు. బంతిని నేరుగా ఆడకుండా అడ్డంగా ఆడేందుకు ప్రయత్నించడం వల్లే పాకిస్థాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌ల్లో అవుట్ అయ్యారని గుర్తు చేశారు. బౌలర్లు చోటు ఇవ్వకపోయినా రూమ్ కోసం ప్రయత్నించడం అభిషేక్‌కు ఇబ్బందిగా మారుతోందని పఠాన్ పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా బౌలర్లు కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో టెక్నిక్‌ను మార్చుకోకుండా, కేవలం సింగిల్స్ తీసి ఖాతా తెరవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. స్పిన్నర్లను ఎదుర్కొనేటప్పుడు ఆచితూచి ఆడి, ఫాస్ట్ బౌలర్లను టార్గెట్ చేయాలని ఆయన సలహా ఇచ్చారు.

సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
EVENING EDITION 4PM

## భయపడకండి.. మీకు అండగా ఉంటాం..
# మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాసులకు హరీశ్‌రావు భరోసా

కేసీఆర్ మంచి నీళ్లు ఇచ్చి, బతుకులను నిలబెడితే.. సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. డీపీఆర్ లేదు.. ఎఫ్‌టీఎల్ తేలలేదు.. అనుమతులు లేవు.. ఏ చట్టం ప్రకారం ఇండ్లు ఖాళీ చేయమని నోటీసులు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇండ్లు కూల్చే బదులు నీళ్ల ట్యాంకులో విషం కలిపి చంపండి అని తల్లులు ఆవేదన చెందుతున్నా ఈ ప్రభుత్వానికి కనీస కనికరం లేదా అని ప్రశ్నించారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులు భేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇండ్లు కోల్పోతున్న మధు పార్క్ అపార్ట్‌మెంట్ బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్



ఇంఛార్జి కార్తీక్ రెడ్డి తదితరులు కలిసి పరామర్శించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపిన హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మేం మూసీ శుద్ధికి వ్యతిరేకం కాదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఎస్టీపీలు కట్టు, మురుగునీరు రాకుండా చెయ్, కేసీఆర్ కట్టిన కాళేశ్వరం పైపులైన్లతో గోదావరి నీళ్లతో మూసీని శుద్ధి చెయ్. కానీ మూసీ అభివృద్ధి పేరిట పేదల ఇండ్లు కూల్చడాన్ని మాత్రమే మేం వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బాపు ఘాట్ వద్ద అహింసా మూర్తి గాంధీ విగ్రహం పెట్టి ఆరాధించాలి తప్ప.. ఆ విగ్రహం, నిర్మాణం పేరిట ప్రజల ఇండ్లు కూల్చుతూ, హింసాత్మక మార్గంలో భయాందోళనలకు గురిచేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇండ్లు ఖాళీ చేస్తారా, లేక జేసీబీ పంపి కూల్చమంటారా అని అధికారులు బెదిరిస్తున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డికి ఈ అపార్ట్‌మెంట్ అంటే కేవలం ఇటుకలు, సిమెంట్ మాత్రమే కావచ్చు.. కానీ ఒక మధ్యతరగతి వాడికి రెక్కలు ముక్కలు చేసుకుని, బ్యాంకుల చుట్టూ తిరిగి అప్పులు తెచ్చుకుని కట్టుకున్న జీవితకాలపు సొంతింటి కల అది అని పేర్కొన్నారు. ఇండ్లు కూల్చడమంటే ఇక్కడి బతుకులను కూల్చడమే అని స్పష్టం చేశారు. పసిపిల్లలు కంటిమీద కునుకు లేకుండా రేపు పరీక్షలు ఎలా రాస్తారని ప్రశ్నించారు. నీకేంటి రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్‌లో 100 కోట్లతో ప్యాలెస్ కట్టుకుంటున్నావు. రోడ్డున పడేది ఈ పేదలు అని అన్నారు. ఇప్పటివరకు మూసీ ప్రాజెక్టుకు అసలు డీపీఆర్ లేదు. ఎఫ్‌టీఎల్ ఫిక్స్ కాలేదు. ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ రాలేదు. కనీసం సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ కూడా జరగలేదని హరీశ్‌రావు తెలిపారు. అలాంటప్పుడు నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇందాక ఒక సోదరి మాట్లాడుతూ 'వి వాంట్ కేసీఆర్ బ్యాక్' అని అన్నారని.. రాష్ట్రంలో కచ్చితంగా వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. అప్పుడు ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని బాగు చేసి చూపిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూముల రేట్లు పడిపోయాయని పేర్కొన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పడిపో యిందని.. ఎక్కడ చూసినా దోపిడీ యే అని విమర్శించారు. హైడ్రా ముసుగులో దోపిడీ, మూసీ ప్రాజెక్టు విషయంలో దోపిడీ, పేరిట, భూముల అమ్మకాల పేరిట అంతా దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు.

## కరీంనగర్ మేయర్‌గా
# బాధ్యతలు స్వీకరించిన కొలగాని శ్రీనివాస్



కరీంనగర్ నగర మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్‌గా తొలి రోజే నగర అభివృద్ధిపై దృష్టి సారించిన శ్రీనివాస్, ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కొరత సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అదే విధంగా విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన మంజూరు పత్రాలపై తొలి సంతకం చేశారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధి కోసం చర్యలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నగర సమగ్రాభివృద్ధే తన లక్ష్యమని, ప్రజల ఆశలు నెరవేర్చేందుకు కృషి చేస్తానని మేయర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.



## శ్రీశైలంలోని వీఐపీ కాటేజీలో
# అగ్నిప్రమాదం, భక్తులకు తప్పిన ప్రమాదం

ఏపీలోని నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లికార్జునస్వామి సన్నిధిలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వీఐపీ కాటేజీలో జరిగిన ఈ ఘటనలో భక్తులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆలయ అబ్బూరు వీఐపీ కాటేజీలోని మొదటి అంతస్తులో షార్ట్‌సర్క్యూట్‌తో ఏసీ పేలి మంటలు చెలరేగాయి. గమనించిన 12 మంది భక్తులు అక్కడి నుంచి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల...
# చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు



వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు.

## ఫెరారీ కారు బీభత్సం : బాలకృష్ణ ఇంటి వద్ద యాక్సిడెంట్

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో గల సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నివాసం సమీపంలో ఆదివారం భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంతో వచ్చిన ఒక ఫెరారీ కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి పక్క రోడ్డులోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఆ కారు విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడమే కాకుండా, ఎదురుగా వస్తున్న మరో రెండు కార్లను, బైక్‌లను కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు వాహనాలన్నీ రోడ్డుపై అడ్డదిడ్డంగా పడిపోయాయి. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలవ్వగా, స్థానికులు వెంటనే స్పందించి వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.


## అంకెల గారడీతో ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తారు

**దాసోజు శ్రవణ్ ధ్వజం**

రాష్ట్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఆదాయ లక్ష్యాలను నిర్ణయించి, అధిక అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం దిశగా నెడుతోందని బీఆర్ఎస్ శ్రీమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. కాగ్ నివేదికలో వెల్లడైన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ ఆర్థిక విధానాలపై విశ్లేషణాత్మక నివేదికలో తీవ్ర విమర్శలు గుప్పించారు. 2025—26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ₹2.29 లక్షల కోట్లకు పైగా ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ, రూ.1.38 లక్షల కోట్లు మాత్రమే వసూలు చేసిందని దాసోజు శ్రవణ్ తెలిపారు. జనవరి 2026 నాటికి సుమారు 60 శాతం మాత్రమే వసూలు చేయగలిగిందని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరానికి ఇంకా రెండు నెలలు మాత్రమే మిగిలి ఉండగా భారీ లోటు కనిపించడం బడ్జెట్ అంచనాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని సూచిస్తోందన్నారు. ప్రజలకు కాగితాలపై అభివృద్ధి చూపిస్తూ వాస్తవ ఖజానా ఖాళీ అవుతోందని విమర్శించారు. టార్గెట్ 100 శాతమైతే.. సాధించింది




కేవలం 60 శాతం మాత్రమేనని.. ఇది కేవలం కాంగ్రెస్ మార్క్ కాగితపు సిరి అని వ్యాఖ్యానించారు. రియల్ ఎస్టేట్ రంగానికి రివర్స్ గేర్ పడుతోందని దాసోజు శ్రవణ్ విమర్శించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంలో కూడా గణనీయమైన తగ్గుదల నమోదైందని తెలిపారు. ₹19,087 కోట్ల లక్ష్యానికి వ్యతిరేకంగా సుమారు ₹12,345 కోట్ల వరకే వసూళ్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఒకప్పుడు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ప్రధాన ఆధారంగా నిలిచిన రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం మందగమనంలో ఉందని, పెట్టుబడిదారుల విశ్వాసం తగ్గడం ఇందుకు కారణమని ఆరోపించారు.



## జిగిల్‌మనేలా
# నేహా అందాలు

తెలుగు కుర్రాళ్ల గుండెల్లో రాధికగా నిలిచిపోయింది నేహా శెట్టి. డీజే టిల్లు సినిమాతో ఒక్కసారిగా సెన్సేషన్ అయిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాత్రం అంతగా అవకాశాలు అందుకోలేదు. గ్లామర్ బ్యూటీగా వెండితెరపై సంచలనం సృష్టించిన ఈ అమ్మడు.. ఇప్పుడు సినిమాలతోపాటు.. ఇటు సోషల్ మీడియాలోనూ సైలెంట్ అయ్యింది. తాజాగా ఈ వయ్యారి లేటేస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. మంగుళూరుకు చెందిన నేహా శెట్టి.. చిన్న వయసులోనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 2014లో మిస్ మంగుళూరుగా కిరీటాన్ని దక్కించుకున్నారు. ఆ తర్వాత 2015లో మిస్ సౌతిండియా పోటీల్లో రన్నరప్ గా నిలిచింది.



## మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డికి
# ఏసీబీ నోటీసులు

మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డికి ఏసీబీ నోటీసులు జారీ చేసింది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కుంభకోణం కేసులో భాగంగా ఈ నోటీసులు అందజేశారు. ఈ కేసుకు సంబంధించి కోర్టులో హాజరై తన వాదనలు వినిపించుకోవచ్చని నోటీసుల్లో పేర్కొన్నారు. అధికారులు జారీ చేసిన నోటీసుల ప్రకారం ఈ నెల 27న విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు సంబంధించిన అవకతవకలపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆళ్ల రామకృష్ణా రెడ్డి కోర్టుకు హాజరవుతారా లేదా అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## కాంగ్రెస్ నేతలపై దాడి హేయం:
# గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి ఇంటి వద్దకు వెళ్లిన సీనియర్ కాంగ్రెస్ నేత గిరెడ్డి మహేందర్ రెడ్డిపై దాడి చేయడం సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న పోసానిపేట్ మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డిని ఆయన పరామర్శించి, ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ స్టేషన్ నుండే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో ఫోన్లో మాట్లాడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



## నాడు కుంభకోణాలు..
# నేడు అభివృద్ధి
## ప్రధాని మోడీ

ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ లో దేశంలోనే మొట్టమొదటి సెమీ హైస్పీడ్ ప్రాంతీయ రైలు సర్వీస్ నమో భారత్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతికతతో రూపొందిన ఈ ఆర్ఆర్టీఎస్ రైలు గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని స్వయంగా ఈ హైస్పీడ్ మెట్రోలో ప్రయాణించి అందులోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు.. కాంగ్రెస్ నాయకులు తనపై ఉన్న ద్వేషంతో తన సమాధి తవ్వాలని చూస్తున్నారని, చివరకు తన తల్లిని కూడా అవమానించడానికి



వెనుకాడటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐ గ్లోబల్ సమిట్ వంటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమాల్లో కూడా కాంగ్రెస్ మర్యాదలు ఉల్లంఘించిందని ఆయన విమర్శించారు.